పోలీసులు రాజుని పట్టుకెళ్ళారు. అతడింకా అరుస్తూనే వున్నాడు. క్రమక్రమంగా అరుపులు దూరమయ్యాయి.

నిశ్శబ్దం చోటు చేసుకుంది.

ఆ నిశ్శబ్దంలో భైరవమూర్తి వచ్చి విశాల్ పక్కన కూర్చున్నాడు. మధూహ ఇంకా శిలాప్రతిమలాగానే నిల్చుని వుంది. భైరమూర్తి విశాల్ శరీరంమీద ఆమె రక్కిన ప్రదేశాల్నీ, ఆమె శరీరంమీద క్షతాల్నీ పరిశీలించి తృప్తిగా " ...... చాలు, ఈ ఋజువులు చాలు " అన్నాడు స్వగతంగా.

తరువాత విశాల్‌వైపు తిరిగి "అర్థమైందా నేను చేసింది ఏమిటో?" అని అడిగాడు "ఇండియన్ పీనల్ కోడ్‌లో ...... ఒక స్త్రీ రేప్ కాబడుతున్నప్పుడు, ఆ రేప్ చేస్తున్న వ్యక్తిని చంపితే శిక్ష లేదు. అలా చంపింది పోలీస్ ఆఫీసరయితే అసలు కేసే లేదు" నవ్వాడు.

"యూ బ్రూటస్ ...... " గొణిగాడు విశాల్.

భైరవమూర్తి మొహంలో నవ్వు మాయమైంది "బ్రూటస్ కాదు. భైరవమూర్తి. ఇన్‌స్పెక్టర్ భైరవమూర్తి ...... " అన్నాడు.

"ఈ అమ్మాయి నా దగ్గిరకొచ్చి కేసు వివరాలు చెప్తూంటేనే ఇందులో బలం లేదని అర్థమైంది. కోర్టులో నిరూపించటం కష్టం. ఇన్ని వేలమందిని మోసం చేస్తున్న నువ్వు సులభంగా శిక్షనుంచి తప్పించుకోగలవు. అమాయకులైన జనం మళ్ళీ యధావిధిగా నీ దగ్గిరకి వస్తారు. అందుకని ఈ ప్లాన్ వేశాను. నా కక్ష తీర్చుకున్నాను".

"క ...... కక్షా!"

"అవును కక్షే" గట్టిగా అరిచాడు ఇన్‌స్పెక్టర్ భైరవమూర్తి. "ఏ న్యాయస్థానానికీ అందని కక్ష! ఏ నేరస్తుడూ వూహించలేని ప్లాన్!! నా మొహంలో చూడు విశాల్!! నీకే పోలికలూ కనపడటం లేదూ?"

విశాల్ మూతపడుతూన్న కళ్ళని తెరవటానికి ప్రయత్నిస్తూ ...... “లేదు” అన్నాడు.

భైరవమూర్తి పిచ్చివాడిలా మొహాన్ని అటూఇటూ తిప్పుతూ “లేదూ? లేదూ?” అని అరిచాడు.

“ ...... సరిగ్గా చూడు. ఒక యువకుడి పోలికలు నామొహంలో కనపడటం లేదూ? న్యాయం కోసం నిలబడ్డ యువకుడు ! ...... సరిగ్గా చూడు ...... నువ్వు కాళ్ళు నరికావు గుర్తుందా? ...... ఆ యువకుడు ...... శివశంకరం ...... లాయరు ...... గొప్ప క్రిమినల్ మైండ్‌తో ప్లాన్ వేశావు కదూ. ఒక ఆదర్శప్రాయుడైన లాయర్ని జీవితాంతం అవిటివాడిని చేశానని మురిసిపోయావు కదూ. ఇప్పుడు చూడు. అంతకన్నా గొప్ప ప్లాన్ వేశాను. కోర్టుకన్నా పెద్ద శిక్ష నేనే వేశాను ...... హ్హాహ్హాహ్హా ...... ” నవ్వుతున్నాడు. “ ...... ఎందుకంటే ...... ఎందుకంటే శివశంకరం నా కొడుకు! ...... శంకరం నా ఒక్కగానొక్క కొడుకు ...... ”

గదిలో గడియారం చప్పుడు తప్ప మరేమీ వినపడటం లేదు. ఈ ఇద్దరు యువతులూ స్తబ్దుగా అలాగే కూర్చుని వున్నారు.

రెండు విభిన్నమైన రీతుల్లో జీవితాన్ని ప్రారంభించి ...... రెండు విభిన్నమైన గమ్యాల్ని చేరుకున్న యువతులు!

సాంప్రదాయబద్ధంగా వివాహమాడి, లక్ష కలల్తో వైవాహిక జీవితంలోకి అడుగిడి, కలలు కల్లలవుతున్న తరుణంలో ...... మరో యువకుడి ప్రేమని ఆస్వాదించలేక ...... ద్వైదీభావంతో మానసిక రోగపు అంచులకు చేరుకుని ...... కష్టపడి తన జీవితాన్ని సరిదిద్దుకున్న యువతి ఒకరైతే ......

తెలిసీ తెలియని వయసులో ప్రేమించి, ఆ తరువాత జ్ఞానాన్ని సంపాదించి ...... ప్రేమని జ్ఞానం అధిగమించగా ...... అప్పటికే చేతులు కాల్చుకున్న యువతి మరొక ఆమె.

“ ...... ప్రహసిత్‌కి జరిగినదంతా తెలుసు. అతడే తన జీవితంలోకి నన్ను ఆహ్వానించాడు ...... అతడు మనసు కోల్పోయాడు ...... నేను శరీరాన్ని కోల్పోయాను ...... గుడ్డివాడికి కుంటివాడు తోడయినట్టే మేమిద్దరం కలిసి జీవించాలనుకుంటున్నాం. లోకం దృష్టిలో భార్యాభర్తలం. నా బిడ్డకి అతడు తండ్రి. అంతే ...... ”.

“కాకపోవచ్చు” మధ్యలో  అంది లక్ష్మి “ ...... జీవితం ఎప్పుడూ ఒకేచోట ఆగిపోదు. ప్రహసిత్ ప్రేమని నేను శంకించటంలేదు. కానీ ఎప్పటికయినా అతడు మారొచ్చు. విష్ణుని నేను మార్చుకోలేదూ ...... అలాగే నువ్వూ ప్రయత్నించు. ప్రయత్నంలో తప్పులేదుగా.”

ఆమె మాటల్లో వున్న సత్యాన్ని జీర్ణం చేసుకోవటానికా అన్నట్టు మధూహ కొంచెంసేపు మౌనంగా వుండిపోయి అంది “ ఎప్పటినుంచో నాకు ఒక అనుమానం వుంది లక్ష్మీ. నీలో ఇంతమార్పు ఒక్కసారిగా ఎలావచ్చింది?”.

“బుద్ధుడికి బోధివృక్షం క్రింద జ్ఞానోదయం అయినట్టు ఒక అర్థరాత్రి నాకూ జ్ఞానోదయం అయింది” నవ్వింది లక్ష్మి. “ ఆ బోధివృక్షం ఎవరో నీకూ తెలుసు. ఎప్పుడూ మనిషి ఎందుకు నవ్వుతూ వుండాలో ఆ వృక్షమే చెప్పింది. నేనూ చదువుకున్న దాన్నే. కానీ నా తెలివితేటల్ని లోకజ్ఞానంగా మార్చుకునే ప్రయత్నం చేయలేదు. నేనెప్పుడు ...... నాలో నేనే ఘర్షించుకుని, అదే నా ప్రపంచమనుకుంటూ, ఇంట్రావర్ట్‌గా సెల్ఫ్‌పిటీతో కుమిలిపోయాను.”

లక్ష్మి కొనసాగించింది. “భార్యాభర్తల మధ్య కావల్సింది అన్నిటికన్నా ముఖ్యంగా ...... కమ్యూనికేషన్! మానసికంగా, శారీరకంగా ...... రెండోది అండర్‌స్టాండింగ్ ...... డిపెండెన్సీ! అవతలి వారిని తనమీద ఆధారపడేలా చేసుకుంటూ, వారిమీద ఆధారపడటం!  ...... గత కొద్దినెలలుగా నేను అదే చేస్తూ వచ్చాను. ఆ క్రమంలో నాకిష్టంలేని పనులు కొన్ని నేను చేసి వుండవచ్చు కానీ ఆఫ్టాల్ అదంతా నాభర్త కోసమే కదా!”

“విష్ణు మారాడా?”

“తెలీదు. ఒకవేళ మారినా అది తాత్కాలికమై వుండొచ్చు. కానీ ప్రయత్నం ...... ప్రయత్నం జరుగుతోంది కదా! అదీ కావాల్సింది. సకల సద్గుణ సంపన్నుడయిన

భర్తకి ఆక్సిడెంట్ జరిగి, చావుబ్రతుకుల మధ్య వుండగా, భార్య రక్తం దానం చేసి అతన్ని రక్షించుకుని, మంచివాడిగా మార్చుకోవటానికి ఇదేమీ సినిమా కాదుగా ...... జీవితం!! సినిమా ...... శుభంతో పూర్తవుతుంది. జీవితం కొనసాగుతూనే వుంటుంది. దాన్ని శుభప్రదంగా వుంచుకోవటం కోసం నిరంతరం ప్రయత్నిస్తూనే వుండాలి ...... ''.

బయట కారు హారన్ వినిపించింది. మధూహ లేచింది. ''ప్రహసిత్ వచ్చినట్టున్నాడు. వెళ్తాను'' అంది.

లక్ష్మి కూడా లేస్తూ ''నీకు పుట్టబోయే బిడ్డని మాకిస్తావా?'' అని అడిగింది.

హఠాత్తుగా ఆమె అడిగిన ఆ కోర్కెకి మధూహ ఒక్క క్షణం ఆశ్చర్యపోయింది.

''అవును మధూ. మాకెలాగూ సంతానం కలగదు. నీకూ ప్రహసిత్‌కీ మధ్య అడ్డుగా ...... '' అంటూండగా మధూహ తేలిగ్గా నవ్వేసి ''ఇస్తాలే ...... '' అంది. ''కానీ రాజు జ్ఞాపకాన్నీ నేను వుంచుకుని, ప్రహసిత్‌వల్ల కలిగిన బిడ్డని నీకిస్తే ఎలా వుంటుందంటావ్?''.

''చాలా మెలోడ్రమెటిక్‌గా వుంటుంది'' ఇద్దరూ నవ్వేశారు.

ముందు గదిలోకి వస్తూండగా ''ఇంకొక్క అనుమానం '' అంది మధూహ.

''ఇన్ని అనుమానాలుండటం అంత ఆరోగ్యకరం కాదే. అడుగు'' అంది లక్ష్మి.

'మగవాళ్ళు అంత సులభంగా మారతారా? కమ్యూనికేషన్, డిపెండెన్సీ, అర్థం చేసుకోవటం ...... ఇవ్వే సరిపోయిన పక్షంలో ఇన్ని సంసారాలు ఇంత దరిద్రంగా ఎందుకుంటాయి? ఇంతమంది ఆడవాళ్ళు ఇంత అసంతృప్తిగా ఎందుకుంటారు?''

''ఒక్క ఆడవాళ్ళనే ఎందుకంటావ్? మగవాళ్ళలో మాత్రం అసంతృప్తి వుండదా?''.

''తీర్చుకునే మార్గాలు చాలా వుంటాయి వాళ్ళకి''.

“నే వ్రాయబోయే తరువాతి నవల అదే. ఒక స్త్రీ రకరకాలుగా ప్రయత్నించి కూడా తన భర్తని  సరిదిద్దుకోలేకపోతుంది. భర్త ఎంత క్రూరుడంటే ...... కత్తిపీటతో మెడ వెనుక గాయం కూడా చేస్తాడు. అప్పుడామె ఒక పల్లెటూరు వెళ్ళి స్నేహితుడితో ఒక అనుభవాన్ని జీవితకాలం మిగుల్చుకుంటుంది. ఆ స్ఫూర్తితో భవిష్యత్తులోకి అడుగుపెడుతుంది. నైతికవిలువలు, సామాజిక పరిణామాలూ, గాడిదగుడ్డూ ...... ఏవీ ఆలోచించదు”.

“బావుందే. టైటిల్ ఏమిటి?”

“ప్రేమ”

“ప్రేమా? అదేంప్రేమ”

“తనని తాను ప్రేమించుకోవటం ముఖ్యమని నువ్వే అన్నావ్‌గా. అన్నిదార్లూ మూసుకుపోయినప్పుడు అదే చెయ్యాలి మరి. కానీ మనలో డిఫెక్ట్ ఏమిటంటే ఆనందం అనేది ఎక్కడో వుంటుందనుకుంటాం. అరకులోయగురించీ, అలక్‌నంద గురించీ ఆలోచిస్తాం. కిటికీ తెరిస్తే కనపడే సూర్యోదయాన్ని చూడం ”

మధూహ మెట్లు దిగి వెళ్ళి కార్లో కూర్చుంది. లక్ష్మి లోపలే వుండిపోయింది. కిటికీ తెరల మధ్యనుంచి డ్రైవింగ్ సీట్‌లో వున్న ప్రహసిత్ కనపడుతున్నాడు.

కారు కదలగానే నెమ్మదిగా దృష్టి పథంలోంచి కనుమరుగయ్యాడు.

డ్రైవింగ్ తెలిసిన వ్యక్తి చేతిలో జీవితంలా సాఫీగా సాగిపోతోంది కారు.